

# అమెరి'కాకమ్మ'కథలు

## వంగూరి చిట్టెన్‌రాజు



## మళ్ళీ "ఫింకి" పోయింది.

అమెరికాకమ్మ కథలు- 5

నేను అమెరికా వచ్చిన "చిన్నప్పుడు", యూనివర్శిటీ ఆఫ్ హ్యూస్టన్‌లో పోస్ట్ డాక్టరల్ రిసెర్చ్ పని చేశేవాణ్ణి. అంటే అటు ఉద్యోగమూ కాని, అలా అని అది మరీ స్టూడెంట్ వ్యవహారం కూడా కాదు. ఉద్యోగం వెతుక్కుంటూ, విద్యార్థిలాగ నటించే రోజులన్న మాట. నెల సరి "ముష్టి" అనగా, భత్యం 150 డాలర్ల లోపే. అప్పుడు నాకు మా ఊళ్ళోనే ఉన్న రైస్ యూనివర్శిటీ అనే సుప్రసిద్ధమైన ప్రపంచ స్థాయి యూనివర్శిటీలో మిత్రులతో టెన్నిస్ ఆడడానికి వెడుతూ ఉండే వాణ్ణి. అక్కడే ఈ నాటికీ నా ఆప్త మిత్రుడు అనిల్ కుమార్ పనిచేస్తూ ఉండే వాడు. లక్కీగా అతనేం పని చేశేవాడో అతనికీ, అతని బాస్‌కీ తెలియదు కాబట్టి, అప్పుడు హ్యూస్టన్‌లో ఉన్న ఒకే ఒక్క ఇండియన్ రెస్టారెంట్ కూడా అనిల్ నడిపే వాడు. యధాప్రకారం అతను ఏం పెట్టాడో, మేం ఏం తింటున్నామో అతనికీ మాకూ కూడా తెలిసేది కాదు. అప్పుడూ, ఇప్పుడూ కూడా వీడియో కెమేరాల గురించి ఈ మానవుడికి బాగా తెలుసును.

నేను ఒక సారి ఆవేశపడి ఒక ఖరీదైన వీడియో కెమెరా కొన్నాను. ఈ నాటి తరానికి తెలియదు కానీ, ఆ నాటి వీడియో కెమెరాలు ఒక టన్ను బరువూ, చిన్న సూట్ కేస్ అంత సైజూ ఉండేవి. ఈ రోజుల్లో లాగా అరచేతిలో వైకుంఠం సైజు కాదు. వీడియో సినిమా తీశేశాక, ఆ పెద్ద వీడియో టేపు టీవీలో చూడడానికి కవల పిల్లలలాగా మరొాక రెండు అదే సైజు యంత్రాలు ఉండేవి. ఒక పిల్ల పేరు ప్లేయరూ, మరొక దాని పేరు మిక్సరో, జీడిపప్పో, మరొకటో జ్ఞాపకం లేదు. సరికొత్త వీడియో కొనగానే కేవీరెడ్డి లాంటి మాయా బజార్ ఫీలింగు వచ్చేసింది. మనకంటే బెంగాలీ వాళ్ళు బెటరు కాబట్టి నేనొక సారి సత్యజిత్ రాయ్ టైపులో ఒక చిన్న చిత్ర రాజము తీసి పారేసి, నా డైరెక్షన్ మరియు మార్కస్ బార్ట్లీ ని మించిన నా ఫొటాగ్రఫీ ఎలా ఉన్నాయో చూపించడానికి పది మందిని పిలిచి పార్టీ పెట్టాను.

అందరూ రాగానే, నేను కించిత్తు గర్వంగా ఆ వీడియో టేపుని ప్లేయర్ అనబడే కవల పిల్ల యంత్రంలో పెట్టి, రెండో కవల పిల్ల తాలూకు ఎర్ర స్విచ్ నొక్కాను...వాళ్ళు చెప్పిన పద్ధతి ప్రకారం. వెనువెంటనే నా కలర్ టీవీలో బ్లాక్ రంగులో చుక్కలూ, గీతలూ,

ఉరుములూ, మెరుపులూ, గుర్రు, గుర్రు అంటూ విపరీతమైన శబ్దాలూ రావడం మొదలు పెట్టాయి. ఒకావిడ హడిలి పోయి, అప్పుడే పెళ్ళాడిన మొగుణ్ణి అర్జంటుగా వాటేసుకుని ఆనంద పెట్టబోయింది. ఎంత అమెరికాలో ఉన్నప్పటికీ, పబ్లిగ్గా పెళ్ళాంతో ఇటువంటి చేష్టలు అలవాటు లేని ఆ మానవుడు ఉలిక్కి పడి, సొంత, సరికొత్త పెళ్ళానికి కూడా ఒక మైలు పక్కకి జరిగిపోయి, నాకేసి తీవ్రంగా చూశాడు. చెప్పొద్దూ ఇటువంటి మాంచి రొమాంటిక్ సదవకాశాన్ని ప్రసాదించిన నన్ను అభినందించడం పోయి ఆ నూతన వరుడు నన్ను అంత డేమేజింగ్ గా చూడడం బాగా లేదు కదా! కాస్సేపటికి, నేను ఎన్ని సార్లు వీడియో టేపునీ, కవల పిల్లలనీ, ఆఖరికి నా అపురూప కలర్ టీవీనీ ఎడా పెడా వాయించినా, పైకెక్కి గెంతినా ఆ టీవి లోంచి ప్రకృతి భీభత్సం ఆగలేదు. నేను ఏ మాత్రం చిత్రీకరించని స్పెషల్ ఎఫెక్టులూ, చుక్కలూ, సౌండ్ రికార్డింగులూ విజృంభించాయి.. ఎటొచ్చీ, ఆ కుర్రాడు మళ్ళీ యధాస్థానానికి పెళ్ళాం పక్కకి వచ్చి కూచున్నా, నూతన వధువు ఇక భయపడ్డం మానేసి, భర్తకి ఆనందం కలిగించడం కూడా మానేసింది.

ఇక ఏం చెయ్యాలో తెలియక , అప్పటికీ, ఇప్పటికీ నా ఆప్త మిత్రుడైన అనిల్ కుమార్ ని "గురూ, దీని సంగతేమిటో చూడు" అని బతిమాలాను. అప్పటికే అతను ఆరో బక్ హార్న్ బీరులో ఉన్నాడు. ఇప్పుడు ఎక్కడా దొరకదు కానీ ఆ రోజుల్లో ఒకే ఒక్క డాలర్ కి ఆరు సీసాల దొరికే ఆ బీరు అచ్చు మా గైగోలుపాడు పాకలలో దొరికే "అనార్కలి" అనే నాటు సారా టేస్ట్ ఈ వెధవ టెక్సస్ వాడు కాపీ కొట్టేశాడు అని అందరికీ అనుమానంగా ఉండేది. కానీ నా ఆర్థిక స్తోమత అప్పుడూ, ఇప్పుడూ అంతే కాబట్టి అప్పుడు అదే కొనుక్కునే వాణ్ణి. ఇప్పుడు.....సర్లెండి....ఆ సంగతి తరవాత చూద్దాం. పాపం అనిల్ కూడా ఎంత ప్రయత్నించినా ఆ కవల పిల్లలు నిద్రలో మునిగిపోవడంతో ఎవరికీ నా చిత్ర రాజము చూసి మెచ్చుకునే అవకాశం రాత్రి సెకండ్ షో టైం దాటిపోయినా కలగ లేదు. అప్పుడు అనిల్ నా భుజం తట్టి "ఎక్కడో ఫింకి పోయింది గురూ, రేపు తంటాలు పడదాం" అనేసి" మరొక అనార్కలి కొట్టేసి ఇంటికి పోయాడు. నా జన్మలో ఈ ఫింక్ అనే మాట వినడం అదే మొదటి సారి.

మర్నాడు ఏదో ఒక ఎలక్ట్రానిక్ స్టోర్ కి వెళ్ళి, ఈ ఫింకులు ఎందుకైనా మంచిది, రెండో, మూడో కొని అవతల పారేద్దాం, అప్పుడు అనిల్ ఈ యంత్రాలని బాగుచేసిన పిమ్మట, మళ్ళీ పార్టీ పెడదామని అనుకున్నాను. కానీ, ఈ ఫింక్ అనే మాట నా బుర్రలో పడిపోయి, అసలు అది ఎలా ఉంటుందీ, ఏ సైజులో ఉంటుందీ, దాన్ని స్క్రూలు పెట్టి బిగించాలా, లేక సుత్తితో కొట్టి మేకుల్లాగ చిన్న కన్నంలోకి తోసెయ్యాలా అనే కుతూహలం ఆపుకోలేకపోయాను. ఇక రాత్రి ఆ వీడియో కెమేరా తాలూకు ఐదు వందల నలభై నాలుగు పేజీల మేన్యువల్స్ ముందేసుకుని...సారీ ముందేసుకుని కూర్చున్నాను. మొదటి పేజీ నుంచి ఆఖరు పేజీ దాకా ఎన్ని సార్లు, ఎంత జాగ్రత్తగా భూతద్దం వేసి వెతికినా ఈ ఫింక్ అనే పార్టు కెమేరాలో కానీ, కవలల్లో కానీ ఎక్కడ ఉంటుందో నాకు కనపడి చావలేదు.

మర్నాడు పొద్దున్నే నిద్ర లేక వాచిన మొహంతో నేను అనిల్‌ని పిలవగానే, వాడు హేంగ్ ఓవర్ పరిస్థితిలో ఫోన్ తీసి "ఏమిట్రా, తెల్లారకుండా వెధవ గోల, ఏం కావాలి? " అనికోప్పడ్డాడు.

"అది కాదు గురూ, ఈ వెధవ ఫింక్ గురించి రామాయణం అంతా చదివినా ఎక్కడా కనపడ లేదు. షాప్ వాడికైనా తెలుస్తుందంటావా? " అన్నాను.

వాడు ఒక్క క్షణం ఆగి, మళ్ళీ, మళ్ళీ నా మాటలే పారాయణం చేయించుకుని ఇక ఆగ లేక పడీ, పడీ పది నిముషాలు నవ్వాడు. నాకు కోపం వచ్చి "ఏమిటి, గురూ, తెల్లారగానే పెద్దజోకు పడినట్టు ఆ పడీ, పడీ నవ్వేమిటీ, దిస్ ఈజ వెరీ సీరియస్ మేటర్" అన్నాను.

సీరియస్ మేటర్స్ ఉన్నప్పుడు నాకు ఎందుకో ఇంగ్లీషు భాష తన్నుకొస్తుంది.

వాడు నవ్వు ఆపి "ఓరి వెర్రి నాయనా, అసలు ఫింక్ అనేది ఏమీ పార్టూ కాదు, దానితో రిపేరూ చెయ్యం." అన్నాడు.

"మరి ఫింక్ అనగా ఏమీ? నిన్న రాత్రి ఫింక్ పోయిందీ, ఇవాళ చూద్దాం అన్నావుగా, పెద్ద గొప్పలాగా?" అని కోప్పడ్డాను అసలు విషయం తెలియక, అర్థమవక.

"అదా? ఎప్పుడైనా, ఏదైనా వస్తువు పని చెయ్యకుండా తగలడిపోతే, వెధవది ఫింకి పోయింది అంటాను. అది నా ఊత పదంలే" అని ఫోను పెట్టేశాడు అనిల్, నన్ను ఒక దిక్కులేని వాతావరణంలో వదిలేసి.

ఇదెందుకు జ్ఞాపకం వచ్చిందంటే, గత ఆరు నెలలగా నేను ఏ విధమైన కంప్యూటర్ కానీ, దాని తాలూకు వస్తువులు కానీ, చేత్తో కానీ, రిమోట్‌గా కానీ ముట్టుకోగానే అన్నీ వరసగా ఫింకి పోతున్నాయి. ఆ ఫింకిని వదిలించుకోవడానికి అన్ని రకాల అస్త్రాలూ వాడితున్నాను....ఒక్క అనిల్‌ని తప్ప....ఎందుకంటే, ఇప్పుడు బక హార్న్ మార్కెట్లో దొరకడం లేదు. అది లేక పోతే ఫింకీ, గింకీ నైజాంతా అంటాడు.

అందుచేత "వైరస్ ఐశ్వర్యా రాయ్" ధర్మమా అని నా సరికొత్త టోషిబా కంప్యూటరు వారి తైవాన్ ఫేక్టరీలో రిపేరులో ఉంది. పోనీ అని పాత డెల్ కంప్యూటర్ దుమ్ము దులిపి వాడడం మొదలు పెడద్దామనుకుంటే, కావలిసిన డేటా అంతా టోషిబా వారి దగ్గర ఉంది. ఎందుకైనా మంచిదని ఆ మధ్యనే బాక్‌అప్ కోసమని కొన్న ఎక్స్‌టర్నల్ హార్డ్ డ్రైవ్ ధర్మమా అని ఈ అమెరికాకమ్మ కబుర్లు మొదలు పెట్టగానే......అవును...అది కూడా ఫింకే పోయింది. అనగా దాని తాలూకు లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి కానీ, లోపలి సరుకు బహుశా ఐశ్వర్యా రాయ్ దంపతుల దగ్గరకి మాయమయిపోయింది.

అటువంటి నిర్జీవంగా ఉన్న హార్డ్ డ్రైవ్ కేసి నేను నిస్సహాయంగా, అసహ్యంగా, ఒళ్ళు మంటతో చూస్తూ ఉండగా, మా ముద్దుల కుమారుడు అర్జంటుగా మేడమెట్లు దిగి వచ్చి, "డాడీ, హాపీ బర్త్ డే" అని బహుమతిగా, నా క్రెడిట్ కార్డుతోనే కొన్న ఒక చొక్కా బహుమతిగా ఇచ్చాడు. మా పిల్లలు ఎప్పుడైనా, ఏదైనా కొన్నప్పుడు నేను అర్జంటుగా దాని మీద ఉన్న "ఖరీదు పత్రం" అంటే...ప్రైస్ టేగ్...చూస్తాను. ఇప్పుడు ఈ చొక్కా ఖరీదు అసలు నూట తొంభై డాలర్ల తొంభై తొమ్మిది డాలర్లు, సేల్ లో కాబట్టి కేవలం యాభై తొమ్మిది డాలర్ల తొంభై తొమ్మిది సెంట్లు మాత్రమే అన్న విషయం గమనించాను.

చొక్కాకి ఎనిమిది డాలర్ల తొంభై తొమ్మిది సెంట్లూ, మేచింగ్ పంట్లానికి మహా అయితే మరొక మూడు డాలర్ల తొంభై తొమ్మిది సెంట్లూ, రెండింటికీ ఖచ్చితంగా మేచ్ అయ్యే మూడు చెడ్డీల పేకెట్ అంతా కలిపి డాలర్ తొంభై తొమ్మిది సెంట్లూ మించి ఏనాడూ ఖర్చుపెట్టని నేను అంత ఖరీదైన చొక్కా నా జన్మలో ఎప్పుడూ వేసుకో లేదు కాబట్టి, మా అబ్బాయికి "థేంక్యూ శుంఠా" అని కృతజ్ఞతలు చెప్పాను. ఇందులో శుంఠా అనగా చాలా ప్రేమపూరితమైన టెలుగూ వర్డ్ అని వాడికి చిన్నప్పటినుంచీ నూరిపోసిన కారణం చేత వాడు అమందానంద కంద.....వాటెవర్....అయిపోయాడు. కన్న తండ్రిని అమందానంద...వాటెవర్ చేసిన ఆనందంతో వాడు మెట్లెక్కి, వాడి ఎపార్ట్‌మెంట్‌కి వెళ్ళి పోయాడు. అమెరికాలో పిల్లలందరూ తల్లిదండ్రుల ఇంట్లోనే ఉన్నప్పటికీ, పై అంతస్తులో వారి, వారి గదులు విడిగా ఉంటాయి కాబట్టి, మనకి చెప్పినా చెప్పకపోయినా, అవి వాళ్ళ సొంత ఫ్లాట్ అనగా, ఎపార్ట్‌మెంటులనే అనుకుంటారు.

వాడు వెళ్ళి పోగానే ఆ చొక్కా కేసి ఆప్యాయంగా చూశాను....దాందుంప తెగా....అది కూడా ఫింకే పోయింది. ఎందుకంటే దానికి జేబులు లేవు...బాఘా ఖరీదైన చొక్కాలన్నీ ఇలాగే ఉంటాయిట. మా వాడు చెప్పాడు. ఇప్పుడూ, చొక్కాకి జేబులు లేకపోతే, పెన్ను మరియు సెల్ ఫోనూ ఎక్కడ పెట్టుకోనూ? రోడ్డు మీద అప్పుడప్పుడూ కనపడే పెన్నీలూ, పది పైసలూ ఎవరు చూడకుండా కిందకి వంగి, బూట్లు సద్దుకుంటున్నట్టు నటిస్తూ, ఆ నాణాలు అర్జంటుగా, హడావుడిగా ఎక్కడ వేసుకోనూ? డబ్బున్న వాళ్ళకి సెల్ ఫోన్లు

చెవిలోనే ఉంటాయి. రోడ్డు మీది డబ్బులు వాళ్ళు పారేసినవేగా. అందుకే వాళ్ళకి చొక్కా జేబులు ఉంటే అవమానం. నాకేమో అత్యవసరం.

ఇప్పుడు నాకు హఠాత్తుగా జ్ఞానోదయం అయినది ఏమిటంటే... నా జాతకం ఇది వరకు వీడియో కెమేరాలూ, తరవాత ల్యాపు టాపులూ, ఇప్పుడు చొక్కాలూ, చెడ్డీలూ...అన్నీ వరసగా ఫింకి పోతున్నాయి.

యధాప్రకారం టెంకి జల్ల టైములో నేను రాస్తున్న ఈ ఫింకోపాఖ్యానం చూచాయగా గమనించి "మై డియర్ హస్బెండూ, కొంత మంది పుట్టగానే పరిమళిస్తారు. నువ్వు పుట్టగానే ఫింకి పోయావు, డు యు నో దట్? హేపీ బర్త్ డే" అని తనదే అయిన సువిశాల ప్రపంచంలోకి నిష్క్రమించింది మా క్వీన్ విక్టోరియా.

"సర్లే కానీ అదేమిటీ, నాకు రోజువారీ టెంకి జల్ల కొట్టకుండానే వెళ్ళిపోతున్నావూ? ఆర్యూ ఓకే? `" అని అరిచాను అలా నిష్క్రమిస్తున్న ఆవిడ సుందర విగ్రహాన్ని వెనకవేపు నుంచి చూసి తరిస్తూ.

"దట్ ఈజ్ మై బర్త్ డే గిఫ్ట్, హనీ".. క్వీన్ విక్టోరియా ఉవాచ.

